## ప్రభాకర శర్మకు గోపాలరెడ్డి పురస్కారం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ప్రముఖ సంస్కృత విద్వాంసులు, మహా మహోపాధ్యాయ డాక్టర్ దోర్బల్ ప్రభాకర శర్మకు 2025 సంవత్సరానికి వేదలంకార డాక్టర్ ముదిగంటి గోపాల్ రెడ్డి పురస్కారం ప్రధానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్ణయించింది. ప్రపంచ మాతృ భాష దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 వ తేదీ సాయంత్రం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళా మందిరంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో ప్రభాకర శర్మకు పురస్కారాన్ని అందజేయనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృత అకాడమీ సంచాలకులు డాక్టర్ పెన్నా మధుసూదన్, పురస్కారం కోసం నిధిని నెలకొల్పిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ముదిగంటి సుజాత రెడ్డి అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పురస్కారం కింద రూ.25 వేల రూపాయలు నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## అధికారులు అందుబాటులో ఉండటం లేదు

అబిడ్స్, ఫిబ్రవరి 11: జీహెచ్ఎంసీ– 14వ సర్కిల్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటం లేదని గోషా మహల్ బీఆర్ఎస్ నేత ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. అబిడ్స్ లోని గోషామహల్ సర్కిల్ కార్యాలయంలో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ప్రజలకు ఖాళీ సీట్లే దర్శనం ఇస్తున్నాయని విమర్శించారు. మంగళవారం ఏఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణను కలిసి గోషామహల్ లో నెలకొన్న వివిధ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బదిలీ అయి వారం రోజులు గడిచినాన పూర్తిస్థాయి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను నేటికీ నియమించలేదని అన్నారు. స్ట్రీట్ లైట్లు వెలగక బస్తీలన్నీ చీకట్లో మగ్గుతున్నాయని అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందని, అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పూర్తిస్థాయి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ను నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ ముదిరాజ్, నరేశ్ గౌడ్, మహేశ్ గౌడ్, రాకేష్ సింగ్, శేఖర్, చింటూ తదితరులు పాల్గొన్నారు

## ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శివకుమార్ తేజవత్

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి11 : హైదరాబాద్ కి చెందిన డాక్టర్ శివకుమార్ తేజవత్ ను నాలుగవ సారి ఇండియన్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ( IPA)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా నియమితులైనట్లు ఢిల్లీ నుంచి జాతీయ జనరల్ సెక్రటరీ భూపేంద్ర కుమార్, జాతీయ అధ్యక్షుడు అభయ్ కుమార్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ తేజావత్ మాట్లాడుతూ.. తనకు లభించిన ఈ పదవి ద్వారా రాష్ట్ర స్థాయిలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ మరియు ఫార్మసీ విభాగంలో చదువుతున్న విద్యార్థులు, ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న మరియు వివిధ రంగాల్లో పనిచేస్తున్నటువంటి ఫార్మసిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఫార్మసీ స్టోర్స్ లో రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్ లే ప్రోపరైటర్ గా ఉండే మెడికల్ షాప్ లకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందేలా కృషి చేస్తానని అన్నారు. తనను నాల్గవ సారి ఐపీఏ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాచిగూడ, ఫిబ్రవరి 11: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అవంతి కళాశాల డైరెక్టర్(హెచ్ఆర్)డాక్టర్ వై.జయప్రద అన్నారు. కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సహకారంతో బర్కత్‌పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బర్కత్‌పుర చౌరస్తాలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, హెల్మెట్ వాడకం, త్రిబుల్ రైడింగ్‌లపై కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వై.జయప్రద మాట్లాడుతూ.. వాహనదారులు తమ రక్షణ కోసం తప్పకుండా హెల్మెట్‌ను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వెంకట్రావ్, సెక్రటరీ సాయిరాం, నరేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## రంగరాజన్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 11: అర్చకుడు రంగరా జన్ పై జరిగిన దాడిని తీవ్రస్థాయిలో ఖండిస్తున్నట్లు తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి అన్నారు. మంగళ వా రం తుల్జా భవన్ ధర్మశాలలో నిర్వహించిన అర్చక ఉద్యోగ జేఏసీ సమావేశంలో చిలుకూరు బాలాజీ దేవాల యం ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దశాబ్దాలుగా దేవాలయాలలో హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నటువంటి అర్చకుని ఇంటికి వెళ్లి దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్ర చార్యు లు, హైదరాబాద్ గ్రేటర్ ఉద్యోగ శాఖ అధ్యక్షుడు బండారు జగపతి, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ , అధ్యక్షుడు చింతపట్ల బద్రీనాథ్ ఆచార్యులు, అగ్నిహోత్రం చంద్రశేఖర శర్మ, ఈ రామ్మోహన్ సమావేశంలో పాల్గొన్నారు.

## పాతబస్తీలో డ్రగ్స్‌పై అవగాహన


బండ్లగూడలో జరిగిన యాంటీ డ్రగ్స్ ర్యాలీలో మాట్లాడుతున్న సందీప్ శాండిల్య

చాంద్రాయణగుట్ట ఫిబ్రవరి 11: హైదరాబాద్ పాతబస్తీలో డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం చాంద్రాయణ గుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్ బండ్లగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజ్ రెడ్డి, ఆధ్వర్యం లో జరిగింది. ఈ కార్యక్రమం గౌస్ నగర్ లోని గవర్నమెంట్ స్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగా ణ యాంటి నార్కొటిక్ డైరెక్టర్ సందీప్ షాండిల్యా తో పాటు ఏసీపీ సుబ్బరామిరెడ్డి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ విచ్చేశారు. డాగ్ ట్రైనర్‌లు రామ్‌రెడ్డి , రాకేశ్ వచ్చారు . సందీప్ షాండిల్యా స్కూల్ పిల్లలతో మాట్లాడుతూ.. డ్రగ్స్ వా డటం వల్ల కలిగే నష్టాలను తెలియ జేశారు. ట్రెయిన్ చేసిన డాగ్ పనిని స్వయంగా చూపించారు. డాగ్ ఒక వస్తువు నుంచి మనిషిని గుర్తించి అతనిని పట్టుకొనేలా చేయటం విశేషం. పిల్లలకు డ్రగ్స్ కు సంబంధించి నా వీడియోలు చూపించి మీరు బాగుంటే దేశం బాగుంటుంది అని అన్నారు.

## డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్‌తో బీసీలకు తీవ్ర అన్యాయం


మాట్లాడుతున్న కృష్ణమోహన్‌రావు, జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, ఫిబ్రవరి 11: ఆగమేఘాల మీద తయారుచేసిన డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్‌తో తెలంగాణ బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో బీసీ సంఘాలు, కుల సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్ రాత్రికి రాత్రే ప్రభుత్వానికి ఇవ్వడంలో మర్మమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం బీసీల పట్ల నిబద్ధత, నిజాయితీని నిరూపించుకోవడానికి రాష్ట్రంలో బీసీల జనాభా లెక్కలు సమగ్రంగా శాస్త్రీయంగా సేకరించడానికి రీ సర్వే చేయించాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. అనంతరం గుజ్జ సత్యం మాట్లాడుతూ.. తొలి దశ నుంచే బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల ఎగవేతకు ప్రభుత్వం రహస్య ఎజెండాను అమలు చేసిందన్నారు. 2011 సంవత్సర లెక్కల ప్రకారం ప్రస్తుతం బీసీ జనాభాను కోటి 64 లక్షలకు తగ్గించి చూపించి ప్రభుత్వం గణాంకాల్లో గారడి చేసిందని ఆరోపించారు. గతంలో ఓసీల జనాభా 10 శాతంలోపే అని చెబుతుండగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకొనేందుకు ప్రస్తుతం 15.79 శాతం చూపించారని, 10 శాతం ఉన్న ఓసీల జనాభా పెరినప్పుడు 56 శాతం ఉన్న బీసీలు పెరగకుండా ఎలా ఉంటుందని సూటిగా ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో నీలం వెంకటేశ్, కోలా జనర్ధాన్, సుధాకర్, నందగోపాల్, ఉదయ్‌నేత, సూర్యనారాయణ, జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామంతో శారీరక దారుఢ్యం

మెహిదీపట్నం, ఫిబ్రవరి 11 : యువకులకు వ్యాయామంతో శారీరక దారుఢ్యం పెరుగుతుందని నాం పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ దుస్సేన్ అన్నారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ శాంతి నగర్లో ఏర్పాటుచేసిన జిమ్ ను ఎమ్మెల్యే , నాయకుడు ఆరిఫ్ రిజ్వాన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

## శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.84 లక్షల నిధులు


గోల్కొండలో శ్మశాన వాటిక వద్ద అభివృద్ధి పనుల గురించి అధికారులతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం, ఫిబ్రవరి 11 : శబ్ ఏ బరాత్ ను పురస్కరించుకొని గురువారం ముస్లింలు శ్మశాన వాటికలలో జరుపుకునే ప్రార్థనల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎ మ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ, నానల్ నగర్, టోలిచౌకి డివిజన్లో ఉన్న శ్మశాన వాటికలలో ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, సర్కిల్–13 ఇంజినీర్ వెంకట శేషయ్యతో కలిసి పర్యటించారు. శ్మశాన వాటికలలో రంగులు వేసే పనులతో పాటు చెత్తాచెదారం తొలగించడానికి 36 శ్మశాన వాటికలలో రూ.84 లక్షల నిధులతో పనులను చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

## దేవాలయాన్ని పునర్నిర్మించాలని నిరసన


సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 11 : అంబర్‌పేట ఛే నంబర్‌లో గల శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ, శివసేన నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం పనులు దా దాపుగా పూర్తి కావచ్చినా దేవాలయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. దేవాల యం చుట్టు ప్రహరీ నిర్మించాలని, మట్టి దిబ్బలను తొలగించి త్వరగా పనులు పూర్తి చేయాలని చెప్పా రు. సంబంధిత కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడారు. కాంట్రాక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకులు ఆర్కే రాంచందర్, దామోదర్ నాయుడు, బి.ఈశ్వర్, సునీ ల్, గట్ల రమేశ్, ఆర్కే చందు, గోపాల్, దుంపల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును వర్తింపజేయాలి



ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న తెలంగాణ పెన్షనర్స్ ప్రతినిధులు


కాచిగూడ, ఫిబ్రవరి 11: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పెన్షన్‌దారులందరికీ వర్తింపజేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇపీఎఫ్ రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బర్కత్‌పుర ఈపీఎఫ్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి, అధ్యక్షుడు నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.9 వేల కు పెంచాలని వారు డిమాండ్ చేశారు.పెన్షన్ దారుల గృహ నిర్మాణానికి బ్యాంకులకు బదులుగా ఈపీఎఫ్ నిధుల నుంచి చెల్లించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పెన్షనర్స్, రిటైర్డ్ అసోసియేషన్ ప్రతినిధులు బర్కత్‌పుర ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.బ్రహ్మాచారి, నాగేశ్వరరావు, నరహరి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవమ్మ సేవలు మరువలేనివి


లక్ష్మీదేవమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ నారగోని

రవీంద్రభారతి, ఫిబ్రవరి11 : మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ సేవలు మరువలేనివి అని పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ నారగోని తెలిపారు. మంగళవారం కీర్తిశేషులు లక్ష్మీదేవమ్మ 15వ వర్ధంతి సందర్భంగా ఇండియన్ ప్రజాకాంగ్రెస్ పార్టీ , పలు సంఘాల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో లక్ష్మీదేవమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త గొల్లపల్లి దయానంద్, మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్పాంజలి, ఇండియన్ కాంగ్రెస్‌పార్టీ పౌండర్ శ్రీధర్, నాదేండ్ల సుధాకర్, నవీన్ నందికొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్ నారాయణ్ ముదిరాజ్ కు ఘన సన్మానం


డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగారం

అబిడ్స్ ఫిబ్రవరి 11 : సమాజ సేవలో డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ చేస్తున్న సేవలు అమోఘం అని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగారం అన్నారు. యూనివర్సిటీ వీసీ నివాసంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మరియు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ గత నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న సేవలను మరియు ఇటీవల అమెరికా దేశం నుండి యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ నుంచి అవార్డు పొందినందుకు శాలువా , జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాలుగా నిర్విరామంగా శాంతి, పర్యావరణ పరిరక్షణ, మాదకద్రవ్యాల వ్యతిరేకం, గుట్కా, పాన్ మసాలా సిగరెట్, క్యాన్సర్ నివారణ, క్షయ, కిడ్నీ, గుండె, జాతీయ సమైక్యత, మతసామరస్యం, యువజన విద్యార్థి సంక్షేమ అభివృద్ధికై నిరంతరం ఎనలేని సేవలందిస్తున్నందుకు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్‌ను సన్మానించారు.

## వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ, ఫిబ్రవరి 11: మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలోని రాజేంద్రనగర్ కాలనీకి చెందిన సౌరబ్(43) స్క్రిప్ట్ రైటర్. కొన్ని నెలలుగా భార్య, పిల్లలు దూరంగా ఉండటంతో మనస్థాపం చెంది మంగళవారం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి యశ్వంత్ ఫిర్యాదు మేరకు అతని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి..

కాచిగూడ, ఫిబ్రవరి 11: పట్టాల పక్కన నడుచుకుంటూ వెలుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన రంగరాజ్(48) టిఫిన్ సెంటర్ వ్యాపారి. మంగళవారం ఉందానగర్–జూకల్ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాల పక్కన నడుచుకుంటూ వెలుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

## ఫారిన్ సిగరెట్ల పట్టివేత

మెహిదీపట్నం, ఫిబ్రవరి 11 : నిషేధిత ఫారిన్ సిగరెట్లను అక్రమంగా విక్రయిస్తున్న ఓ పాన్ మసాలా షాప్ వ్యాపారస్తుడితో పాటు ఆటో డ్రైవర్‌ని అరెస్టు చేసిన ఘటన హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాదుకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ (42) హబీబ్ నగర్ ఆగాపురాలో ఎస్ఎన్ ట్రేడర్స్ పాన్ మసాలా పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దక్షిణ, పశ్చిమ మండలం టాస్క్ ఫోర్స్ పోలీసుల సహకారంతో మంగళవారం అఫ్జల్ సాగర్ ప్రాంతంలో ఆటోలో సిగరెట్లు తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. ఇమ్రాన్ తో పాటు ఆటో డ్రైవర్ ఎండీ అయూబ్ ను పోలీసులు ప ట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20 .50 లక్షల విలువచేసే సిగరెట్లు , ప్యాసింజర్ ఆటోను సీజ్‌చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన


కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న నృత్యకారిణులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి11 : శ్రీలలిత భవాని కూచిపూడి కళానిలయం 19వ వార్షికోత్సవాలు మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కూచిపూడి నృత్యగురువు, శ్రీలలిత భవాని కూచిపూడి కళానిలయం వ్యవస్థాపకురాలు డాక్టర్ వినీలా రావు శిష్యబృందం 250 మంది శిష్య బృందంచే నిర్వహించిన మహిషాసుర మర్ధిని కూచిపూడి నృత్యప్రదర్శన వీక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాట్యగురువు డా.భాగవతుల సేతురామ్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ డా.టి. గౌరీ శంకర్, దైవజ్ఞశర్మ, విజయ్‌కుమార్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కూచిపూడి నృత్యప్రదర్శను ప్రారంభించి, పలువురి నృత్యకారినులను మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ.. భావితరాలకు శాస్త్రీయ కళలు, నృత్యాలను నేర్పించి అవగాహన కల్పించాలన్నారు.

## డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేశా


కార్పొరేటర్ దంపతులను సన్మానిస్తున్న దీపక్‌రెడ్డి, కార్పొరేటర్ అమృత తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 11: అంబర్‌పే నియోజకవర్గంలోని కాచిగూడ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. నాలుగేండ్ల కాలంలో డివిజన్‌లోని బస్తీ, కాలనీలలోని ప్రజలకు అండగా ఉంటూ నిరంతరం సమస్యలను పరిష్కారిస్తున్నందుకు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ అమృత, మాజీ మంత్రి కృష్ణయాదవ్, డాక్టర్ గౌతంరావు మంగళవారం కార్పొరేటర్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, మల్లికార్జున్, రమాదేవి, సంతోష్, భీంరాజ్, రవియాదవ్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విమాన యానంలో ఉపాధి అవకాశాల పై సదస్సు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభు

ముషీరాబాద్, ఫిబ్రవరి 11: విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విమాన యానంలో ఉపాధి అవకాశాలపై సదస్సు జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభు మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇటువంటి కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. సదరన్ సివిల్ ఏవియేషన్ చెన్నై బ్రాంచ్ రిటైర్డ్ మేనేజర్ ఎ.రాంబాబు పాల్గొని విమానయాన షెడ్యూలింగ్, కార్యకలాపాలు, లాజిస్టిక్ విమానాశ్రయంలో వివిధ విభాగాల్లో ఉండే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కోచింగ్ అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, రమాదేవి, నీరజ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## గృహిణి అదృశ్యం


నందిని

కాచిగూడ, ఫిబ్రవరి 11: ఇంట్లోంచి వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చెప్పల్‌బజార్‌కి చెందిన నందిని(41)మంగళవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో ఇంట్లోంచి వెళ్లిన తిరిగి రాకపోవడంతో కలతచెందిన భర్త బహదూర్‌సౌద్ మంగళవారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంట్లోంచి నందిని వెళ్లే సమయంలో పింక్ గల కుర్తపైజమా, గోధుమ రంగు చున్నీ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బార్కాస్ లో అక్బరుద్దీన్ ఓవైసీ పర్యటన



ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. మంగళవారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బార్కాస్ సలాల ప్రాంతంలో ఆయన పర్యటించి, స్థానికుల సమస్యలపై మాట్లాడారు. రంజాన్ మాసం సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.

– చాంద్రాయణ, గుట్ట ఫిబ్రవరి 11

## టాలీవుడ్ సింగర్ సునీత గీతా లాపన

అబిడ్స్ ఫిబ్రవరి 11 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది ఎగ్జిబిషన్ సందర్భంగా విచ్చేసిన సందర్శకులు ఆమె పాటలు విని మంత్రముగ్ధులయ్యారు. ఎగ్జిబిషన్ సొసైటీ కల్చర్ ప్రోగ్రామ్స్ కన్వీనర్ ముఖైర్ హైదర్ కూడా ఆమెతో కలిసి పాటలను పాడి సందర్శకులను అలరించారు.

## నానల్ నగర్ లో అభివృద్ధి పనులు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 11 : ప్రజలకు అన్ని రకాల అభివృద్ధి పనులను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని నానల్ నగర్ కార్పొరేటర్న సిరుద్దీన్ అన్నారు. మంగళవారం హకీంపేట్ లో ఉన్న శ్మశాన వాటికలో వీధిదీపాలను ఏర్పాటు చేయించారు . గురువారం జరగనున్న షబ్బీ బరాత్ పురస్కరించుకొని శ్మశాన వాటికలో వీధిదీపాలు ఏర్పాటు పనులను అధికారులు చేపట్టారు. కార్పొరేటర్ నసీరుద్దీన్ పర్యవేక్షించారు.

## టోలిచౌకి సంతా కాలనీలో ..

టోలిచౌకి సంతా కాలనీలో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను షేక్పేట్ కార్పొరేటర్ రాషీద్ఫర్హాజుద్దీన్ పర్యవేక్షించారు . ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సయ్యద్ ముజీబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యాన్ని అమ్ముతున్న వ్యక్తి .. కేసు నమోదు

కాచిగూడ, ఫిబ్రవరి 11: గుట్టుచప్పుడు కాకుండా పేదల ఇండ్లల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని తీసుకుని అధిక ధరలకు అమ్ముతున్న యువకునిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫైజల్(26)పేదలు నివసించే ప్రాంతాలను ఎంచుకుని తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని తీసుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. మంగళవారం సమాచారం తెలుసుకున్న కాచిగూడ పోలీసులు ఫైజల్ ఇంట్లోని 47 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఫైజల్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.